# క్షణంలో సగం

"శారద"

మనిషి ఎందుకేనా పనికివస్తాడా, అని దీర్ఘంగా ఆలోచించి, ఆలోచించి బుర్ర బొర్రగా మారిన మహానుభావులందరూ కలిసి వేదాంతరావు అధ్యక్షతన సమావేశమైనారు. మనిషిని కూడా ఎందుకైనా ఉపయోగించుకో వచ్చుని వాళ్లు చివరకి అభిప్రాయపడ్డారు.

రిక్షాలు, మోటార్లు నడపటానికి యంత్రాలు ఎక్కువగా లభిస్తున్నందువల్లనూ, పట్నాల్లోనూ, పల్లెల్లోను, మనుష్యప్రసక్తి లేకండానే టెలీ ప్రింటర్లతోనూ, రాడార్లతోనూ, అణుశక్తితోనూ జీవనగమనాన్ని శాంతంగా, అభ్యుదయ పథంలో నడపగలగడం వల్లనూ, అధికంగా వున్న మనుష్యుల్ని మాంసవిక్రేతలకి కంట్రాక్టు ఇచ్చేస్తే దేశానికి ఎంతో మంచిదని వేదాంతరావు ఆ సభలో ఉద్ఘాటించాడు.

దీన్ని ప్రతి పత్రికా ఆమోదించింది; కారణం ప్రణాళికల్ని ఆమోదించటం వాటికి అలవాటు గనకనూ, ఆ ప్రణాళికలు ఎలాగా అమల్లోకి రావు గనుకనూ.

ఈ విషయాల్ని తలక్రిందులుగా చదివి అర్థం అయ్యేందుకు పుస్తకం నిలువుగా పెట్టుకుని చదివీ, వీడికి బోధపడక మళ్లీ ఆ పత్రికలకే ప్రశ్న రాశాడు.

వాళ్ళ సమాధానాలు వ్రాస్తూ, బహుమతి పంపారు ఇంత తెలివిగలవాళ్లు ఇంకా దేశంలో వున్నందుకు. వీడికి అప్పటికీ అర్థంకాక, పోటలుకు పోయాడు. బుర్రకి పనిలేనప్పుడు బొర్రకేనా ఉండాలి, అనే ఉపనిషత్ వాక్యానుసరణి. వీటికే ఈ ఆలోచనలు రావటమేమిటా అని చుట్టూ ఉన్నవాళ్ళు వీణ్ణి చూశారు. వాళ్లెవరూ తినేప్పుడు ఆలోచించరు; ఆలోచించేప్పుడు తినరు. నల్లులమంచం, గయ్యాళి ఇల్లాలు, బెజవాడ కేంద్రం హామేషా, గత నాలుగేళ్ళ నుండి పరివర్తన తెస్తున్నా మారని ఆలోచనలు వేడికాఫీ కుక్షిలోకి పోగానే ప్రారంభమైనాయి మళ్ళీ.

రేడియోలో వేదాంతరావు అర్థశాస్త్ర ఉపన్యాస భాగంగా, ప్రభుత్వం తన ఆదాయాభివృద్ధికి "TAX for THOUGHT" వెయ్యటంలోని ఉపజ్ఞను పొగుడుతున్నాడు.

దీనికోసం డాలర్ ప్రాంతంనుండి భావగా యంత్రములు దిగినవి. 'వంద మాటలకిపైన ఆలోచించే ఒక మాటకి కాణీ చొప్పున వసూలు చేస్తే ప్రభుత్వం రెండేండ్లలో ఎన్నైనా అభివృద్ధి స్కీములు నెరవేర్చ కలుగుతుం దనడంలో ఎట్టి సందేహం లేదు. కొన్ని దిన పత్రికలను, వర్తకులకు, ప్రభుత్వ నాయకులకు వెయ్యి మాటలపైన ప్రతి వంద మాటలకి కాణీ చొప్పున వసూలు చెయ్యవచ్చని ఓ పత్రిక సూచిస్తుంది.

ఇక ఆలోచించటం మానుకోక్కర లేదని చిల్లర చెల్లించి రాబొయ్యే జైలు జీవితం సుఖప్రదమయ్యేందుకు ఏమి చెయ్యాలో రాసుకుంటున్నాడు వీడు.

మనిషికి న్యాయంకన్న అన్యాయం మీద ఎక్కువ మోజు కలగడం కారణంగా, ఏర్పడ్డ పరిస్థితిని చక్కబరచటానికి లా పుస్తకాలకన్న అణుగర్భ విస్ఫోటనం పనికి వొస్తుందని ప్రభుత్వం భావించగలదని మరో మద్రాసు ఉదయ పత్రిక ఒకటి ప్రకటించిన వార్త ధృవపడలేదు.

నడిచి నడిచి సముద్రపొడ్డున కూర్చుని తన శెలవ చీటికి హెడ్ గుమాస్తా రాసిన రిమార్కును చదువుకుంటున్నాడు వీడు. 'నాకు రాత్రి అహింసావాదంలో ఎలాంటి నమ్మకమూ లేని ఒక తేలు కుట్టినందువల్ల ఈ రోజు శెలవ ఇప్పించండి.'

రిమార్కు: 'చచ్చిన తేలును ఎందుకు ఈ ఉత్తరంతో పాటు 'ఎన్క్లోజు' చేసి పంపలేదు?'

ఈ ఉత్తరం తర్వాత రానున్న సంగతులకు గుమాస్తా లెలాగా బాధ్యత వహించరు. ఇంకా గొప్ప రాజనీతిజ్ఞత ప్రదర్శించే మహానుభావులు లేకపోలేదు. వాళ్ళకి బుర్రతప్ప ఇంకేంవుండదు.

**Edited, Printed and Published by KHASA SUBBA RAU, at *Swatantra Printers*, 160, Lloyds Road, Royapettah, Madras.**